


వేమేరేజస్ ఆర్ మేడిన్ హెవెన్ అన్నాడు టెన్నీసన్. స్వర్గంలో పెళ్ళి భూమ్మీదపడి బద్దలవుతుందని అమెరికా వాళ్ళు ఆచరించి మరీ చెబుతున్నారు. అక్కడ ప్రతి రెండు పెళ్ళిళ్ళలోనూ ఒకటి విడాకుల పాలవుతుందని అక్కడి మహానుభావుడే సర్వేచేసి తెలుసుకున్నాడు. ఆయనకు భార్య లేదు. ఇది వేరే సంగతి. ఇంత ఉధృతంగా సాగుతున్న ఈ విడాకుల వ్యవహారం ఇన్సూరెన్సు వాళ్ళని సైతం ఆకర్షించింది. ఇందులో కూడా వ్యాపారం ప్రారంభించేరు వాళ్ళు.

చిన్నపిల్లలు అమ్మా నాన్నా ఆటలాడుకుంటారుగదా, కాని అమెరికా పిల్లలు వాళ్ళ అమ్మా నాన్న ఆటలో ఒక విడాకుల స్లీడన్ని కూడా పెట్టు

కుంటారు. పిల్లడగ్లు లేకపోతే అమ్మ నాన్న ఆట అసహజంగా వుంటుందని వాళ్ళ వుద్దేశ్యం. సమస్య సైజు ఎంతైనా సమస్య సమస్యే. దాని పరిష్కారం విడాకులే. తన పుట్టినరోజు భర్త మరిచిపోయాడనే నెపంతో విడాకులు పుచ్చుకున్న ఇల్లాళ్ళు అక్కడ అనేకం. కోర్టులో తీర్పు చెప్పే జడ్జీగారు సైతం విడాకుల గొడవలో యిరుక్కునే వుంటారు. గనుక సమస్య సిల్లీగా కనిపించదు. నుకియర్ విక్టర్— నీ పిల్లవాడూ, నా పిల్లా కలిసి మన పిల్లవాడ్ని చితక తంతున్నారు. కాంట్యూ కంట్రోల్ దెమ్ అనడిగే భార్యలకు, భర్తలేం సమాధానం చెబుతున్నారో ఆ దేవుడి కెరుక.

పెళ్ళిళ్ళకంటే పెళ్ళాడి విడాకులిచ్చుకునే సంఖ్య ఆమెరికాలో ఎక్కువ. అట్లాగే కొత్తగా పెళ్ళి చేసుకునే వ్యక్తుల సంఖ్య కంటే పాత పెళ్ళికి విడాకులిచ్చేసి కొత్తపెళ్ళి చేసుకునే జనాభా ఎక్కువ. బ్రహ్మచార్లు సైతం పెళ్ళాడి విడాకులిచ్చేసి మళ్ళా పెళ్ళాడేందుకే ప్రాముఖ్యత యిస్తున్నారు. పెళ్ళనగా విడాకుల ముందు జరుపుకొనే తతంగమని కొత్త నిర్వచనం పుట్టిందక్కడ. ఆ విధంగా పెళ్ళి తతంగానికి సంబంధించినంత వరకూ పెళ్ళి కావలసిన వాళ్ళూ, పెళ్ళయిన వాళ్ళూ విడాకులిచ్చి మరో పెళ్ళికి సిద్ధంగా వున్నవారనే మూడు జాతుల వ్యక్తులు అమెరికాలో వున్నారు.

మన అదృష్టం కొద్దీ మన దేశంలో రెండే రెండు జాతులున్నాయి. పెళ్ళి కావల్సిన వాళ్ళు, పెళ్ళయినవాళ్ళు, అంతే. విడాకులంటారా.... అదెక్కడో అరుదుగా చోటు చేసుకుంటున్న తంతు. విడిపోయి బతకడాలున్నాయేమోగాని విడాకుల రభస చాలా తక్కువ. ఇక్కడ హరిశ్చంద్రుడు పుట్టేడు. భార్యని నడివీధిలో నిలబెట్టి అమ్మ జూపితే మీ అజ్ఞ ప్రభూ అనే చంద్రమతులు కూడా ఇక్కడే పుట్టేరు. జూదములో పెళ్ళాన్ని ఓడిపోయిన ధర్మరాజులంగారి వంశీయులం మనం. కుష్టు భర్తని కంటికి రెప్పలా చూచుకుంటూ అతను కోరగా అతన్ని వేశ్యావాటికకు గంపలో ఎత్తుకు వెళ్ళిన

సతీ సుమతి మన ఆడపడుచు. అనుమానించి, అవమానించి అర్ధాంగిని అడవులలోకి పంపించినా .... జన్మజన్మలకీ నువ్వే నా భర్తవి స్వామీ అని కోరుకున్న సీతమ్మవారు మనకి సాక్షాత్తు అమ్మ. ఇంత చరిత్ర మన వెనుక వుంది గనుకనే విడాకు లిక్కడ వంద మహాపాతకాలలో ఒకటి గాకపోయినా ఆ ఛవరు దీనికి వుందని అంగీకరిస్తున్నాం.

భర్త తెగత్రాగి భార్యని చితక తంతాడు. విడాకులుండవు. భార్యకు తెలిసి మరో మనిషితో సంబంధం పెట్టుకుంటాడు· నో రిగ్రెట్స్. ఆ మనిషిని ఇంటికి తెచ్చుకుని భార్యచేత సేవలు చేయించుకుంటాడు. మహా ప్రసాదం. ఈ దేశంలో భర్తే దేవుడు. ఇల్లే నీ ఇల్లు. ఆడపిల్లంటే అర్థం ఆడ-పిల్ల. అంతేగాని ఈడపిల్ల కాదంటూ కన్న తల్లిదండ్రులు వధువుకి నీతి పాఠాలు బోధించి పంపుతారు. తాను కట్టెల్లో కాలిపోయేంత వరకు ఆ నీతుల్ని శిరసా వహిస్తుంది ఇక్కడి స్త్రీ. అలాగే రాత్రి ఎనిమిది దాటిం తర్వాత ఇంటికొస్తే తలుపులుతెరవని భార్యలని ఇక్కడ వినుకోరు. జీతం మొత్తం ఇంటావిడ చేతికిచ్చి రూపాయికి, అర్ధకీ చేయి చాచే తీరుకి ఇంటాయన సిగ్గుపడడు. నిష్కారణంగా అలిగి అలక పాన్పు ఎక్కిన ఇల్లాలి కాళ్ళు పట్టుకునేందుకు ఆ భర్త వెనకాడడు. ఆడదాని చేతిలో తానెంత ఆట వస్తువో తెగులు కార్టూనుల ద్వారా తెలుసుకొని నవ్వుకుంటాడే కాని తన పొజిషన్ మెరుగు పరుచుకునే ప్రయత్నం చేయనే చేయడు. భార్యాభర్తల ఇంతటి సంబంధ బాంధవ్యాలు అలుముకుంటే విడాకులకు చోటెక్కడిది ?

ఏ మాటకా మాటే. మన దేశంలో రాజకీయాలు చోటు చేసుకునే విడాకుల సంఖ్య చూసి మాత్రం అమెరికా కూడా అదిరిపోవలసిందే. తన పార్టీకిగాని సిద్ధాంతానికిగాని ఆట్టేకాలం కట్టుబడి వుండక పోవడం యిక్కడి రాజకీయవేత్తల ప్రత్యేకత. వేరే పార్టీలో హనీమూను ఘనంగా జరుగుతాయని తానే పార్టీకి తాళికట్టేడో దానికి విడాకులిచ్చేయడం ఇక్కడి ఆచారం.

ఈ మధ్యనే ఒకాయిన కేబినెట్ మినిష్టరుగారు అధికార పార్టీని అందమైన వధువుగా పోల్చడం గమనించదగ్గ అంశం. ఆ వధువు ఎందర్నో ఆకర్షించిందట. మొహమ్మీద అక్కడక్కడా మచ్చలున్నా అగ్లీ గా లేదుట. అగ్లీగా వుంటే మాత్రం విడాకులిచ్చి వెళ్ళిపోయేది ఖాయమన్నారు.

వేలాది, లక్షలాది ఓటర్లు ఒక పార్టీని దాని ఆశయాన్నిగాని గౌరవించి ఆ పార్టీ అభ్యర్థిని గెలిపించుకుంటారు. తాను గెలిచిన తర్వాత తనకేదో అసౌకర్యంగా వుందని చిన్న పాయింటుకి విలువ యిచ్చేసి పార్టీ పట్ల ప్రజలకున్న విశ్వాసాన్ని, గౌరవాన్ని కాల్తో తన్నేసి తాను ఇంకో పార్టీకి తాళి కట్టడం ఏ విధంగా సబబవుతుందో పార్టీ ఫిరాయింపు రాజకీయవేత్తలే చెప్పాలి. కట్టుకున్న భార్యపట్ల ఈ దేశంలో వున్న సెంటిమెంటుని, తనని గెలిపించిన పార్టీ పట్ల గూడా ప్రదర్శిస్తే అయిదేళ్ళపాటు ఆ పార్టీకి శ్రీరామరక్ష. భార్య గయ్యాళిదైనా భర్తలు సర్దుకు పోతున్నాం. దేశంలో ఆ సాంప్రదాయం రాజకీయాలలో ఎందుకు పాటించకూడదు? మేరేజెస్ అండ్ గవర్నమెంట్స్ ఆర్ మేడిన్ హెవిన్ అనుకోవాలి. భగ్నమైతే ఇన్సూరెన్సు వాళ్ళు కలుగ జేసుకొని పార్టీ ఫిరాయింపులకు పాలసీలిచ్చి వ్యాపారం చేసుకోవాలి.